# అర్లి(టి)లో అత్యల్పం

### రాష్ట్రంలోనే తక్కువ ఉష్ణోగ్రత
### 11 డిగ్రీల నమోదు



అర్లిలో చలిమంట కాగుతున్న స్థానికులు

భీంపూర్, డిసెంబర్ 10 : భీంపూర్ మండలంలోని పెన్‌గంగా పరీవాహక ప్రాంతంలోని అర్లి(టి)లో మంగళవారం రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత 11 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అర్లి సహా పెన్‌గంగా సమీప గ్రామాలైన గుబిడి, గోముత్రి, కరంజి(టి), కొజ్జన్‌గూడ, అంతర్గాం, గొల్లగడ్, వడూర్‌లలో చలి తీవ్రత అధికంగా ఉన్నట్లు స్థానికులు చెప్తున్నారు. జనం రాత్రుల్లో చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.


నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ బుధవారం 11 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL


# లక్ష మాయం

- బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో పండ్ల వ్యాపారికి నష్టం
- డబ్బులు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు



బ్యాంక్ స్టేట్‌మెంట్ చూపిస్తున్న బాధితుడు

బేల, డిసెంబర్ 10 : మండల కేంద్రంలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న చంద్రమని మొబైల్‌కు శనివారం సాయంత్రం కొత్త నంబర్‌తో కాల్ వచ్చింది. 'మీ సిమ్ బ్లాక్ అవుతుంది, వెంటనే మీ పాన్ కార్డు, ఆధార్ వివరాలు చెప్పాలని కోరారు.' చంద్రమనికి సోమవారం అనుమానం వచ్చి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వెళ్లి నా ఫోన్ హ్యాక్ అయింది. వెంటనే నా అకౌంట్‌ని హోల్డ్‌లో పెట్టాలని బ్యాంకు అధికారులను కోరాడు. దీనికి సంబంధించి ఫారం పూర్తి చేసి వివరాలు ఇవ్వాలని కస్టమర్‌ని బ్యాంకు అధికారులు తెలిపారు. ఫారం పూర్తి చేసే లోపే అతని అకౌంట్ నుంచి లక్ష రూపాయలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. ఈ సందర్భంగా చంద్రమని మాట్లాడుతూ.. బ్యాంకు అధికారుల తప్పిదంగా నా డబ్బులు పోయాయని వాపోయాడు. బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, నా డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయమై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌ను వివరణ కోరగా.. ఇందులో తమ తప్పు లేదని తెలిపాడు.



నేరడిగొండ : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

# కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు

- తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం
- ప్రజల మనోభావాలు దెబ్బ తిన్నాయి
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహానికి చేసిన అపచారానికి నిరసనగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశాయి. ఆదిలాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గ కేంద్రాలతోపాటు మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తప్పు పట్టారు. జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహం కాంగ్రెస్ తల్లి విగ్రహం మాదిరి ఉందని, శుభసూచకంగా కుడి కాలు ముందు ఉండాల్సి ఉండగా.. ఈ విగ్రహానికి ఎడమకాలు ముందు పెట్టారన్నారు. సోనియాగాంధీ మెప్పును పొందడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని మార్చారని తెలిపారు. విగ్రహాన్ని మార్చి ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు.

## నాలుగు కోట్ల ప్రజల మనోభావాలు దెబ్బ తీశారు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీశారని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చీకటిపాలన కొనసాగుస్తుందన్నారు. విగ్రహాలు మార్చుతున్న ముఖ్యమంత్రికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయంలో కూర్చునే హక్కు లేదన్నారు. పార్లమెంట్ ముందు కాంగ్రెస్ ఎంపీలు అదానీ, మోడీ బొమ్మల టీషర్ట్‌లు వేసుకుని వచ్చారని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆ బొమ్మలు ఉన్న టీషర్ట్‌లు వేసుకుని వస్తే పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అదానికి మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్.. తెలంగాణ తల్లి విగ్రహం మార్చడాన్ని వ్యతిరేకించక, కేవలం బతుకమ్మ ఉంటే బాగుండేదని అనడం సమంజసం కాదన్నారు. విగ్రహాన్ని మార్చడాన్ని తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, కవులు, కళాకారులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ర రమేశ్, యూనిస్ అక్బానీ, సాజిదొద్దీన్, విజ్జగిరి నారాయణ, రాజన్న, మెట్టు ప్రహ్లాద్, గండ్రత్ రమేశ్, దాసరి రమేశ్, జగదీశ్, స్వరూపారాణి, సతీశ్, కరుణ, ప్రమీల, పర్వీన్ పాల్గొన్నారు.

## నిర్మల్‌లో భగ్గుమన్న జనం

నిర్మల్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. దీంతో మంగళవారం ఉదయం నుంచే జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గల తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము క్షీరాభిషేకం చేశారు. ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌక్‌లో పార్టీ మండల కన్వీనర్ తాళ్లపెల్లి రాజ్‌గంగన్న, పట్టణాధ్యక్షుడు గౌరీకర్ రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భైంసా పట్టణంలోని గాంధీ గంజ్‌లో గల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాలాభిషేకంలో ముథోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్తలు విలాస్ గాదేవార్, కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్‌లతోపాటు ఆయా మండలాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇదీ ముమ్మాటికీ కక్ష సాధింపే..

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చారని పలువురు విమర్శించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అన్ని వర్గాలకు అనుకూలంగా తెలంగాణ ప్రజల గుండెల్లో రూపుదిద్దుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా విగ్రహాన్ని మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపర్చారని, ఇందుకు ఆయన మూల్యం చెల్లించక తప్పదని దుయ్యబట్టారు. కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం చూస్తుంటే కాంగ్రెస్ తల్లి భావన కలుగుతున్నదన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మను తీసేసి 'హస్తం' గుర్తును చూపించేలా ఈ విగ్రహం ఉన్నదన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే సెక్రెటేరియట్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగిస్తామన్నారు.



భైంసా : పాలాభిషేకం చేస్తున్న ముథోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు



దస్తురాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



ఉట్నూర్ : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్, నాయకులు

# వివేక్‌ను వెంకటస్వామిని చెన్నూర్ గడ్డమీద బొంద పెడుతాం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలి..
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బుర్రి సతీశ్

ఎదులాపురం, డిసెంబర్ 10 : ఈ నెల 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జనలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన గడ్డం వివేక్ వెంకటస్వామిని ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నూర్ గడ్డ మీద బొంద పెడతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బుర్రి సతీశ్ మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణం కోసం సోమవారం నూతన అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధం సంఘాలు ఆదిలాబాద్ జిల్లా నూతన నిర్మాణం జిల్లా సమీక్ష సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. రేవంత్‌రెడ్డి, మాలల సవతి తల్లి ప్రేమకు లొంగిపోవద్దన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సీనియర్ జాతీయ నాయకులు కంబ్లె బాలాజీ మాదిగ, ఉప్పులేటి శ్రీను మాదిగ, గైక్వాడ్ సూర్యకాంత్ మాదిగ, ఇండ్ల ఎల్లన్న మాదిగ, మోడిపల్లి మనోజ్ మాదిగ, అరెపల్లి గణేశ్, రాంప్రసాద్, వినయ్ సాగర్, తరుడి శ్రీను మాదిగ, గజ్జెల అశోక్ దుమల స్వామి అంకుశ్, సునీల్, రవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సతీశ్

# సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సమ్మెలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 10 : సమగ్ర శిక్ష ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయులు మంగళవారం నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు రోజులుగా శాంతియుతంగా నిరసన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో నిరవధిక సమ్మెకు దిగామని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామిని నెరవేర్చాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రేవంత్‌కు చాయ్ తాగే తీరికలేదా?

- యేడాది గడిచినా మాట నిలబెట్టుకోని సీఎం
- మాజీ మంత్రి జోగు రామన్న
- ఉద్యోగుల ఆందోళనకు బీఆర్‌ఎస్ మద్దతు



మద్దతు తెలిపి మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, డిసెంబర్ 10 : 'తాము అధికారంలోకి వస్తే చాయ్ తాగే లోపల రెగ్యులర్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. యేడాది గడిచినా ఇప్పటి వరకు చాయ్ తాగే తీరకదొరకడం లేదా? మరీ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించరా?' అని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో నాలుగు రోజులుగా నిరవధిక దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో మంగళవారం నుంచి సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా తెలంగాణ చౌక్‌లో ఎస్‌ఎస్‌ఏ ఆకారంలో ఉద్యోగులు కూర్చొని నిరసన తెలిపారు. మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన సీఎం రేవంత్‌రెడ్డి తమ హక్కులను కాలరాస్తున్నాడని మండిపడ్డారు. దీక్షా శిబిరానికి మాజీ మంత్రి జోగు రామన్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. రెగ్యులర్ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి యేడాది గడిచినా హామీని ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించాడు. రూల్ ఆఫ్ రోస్టర్ ప్రకారం నియామకాలు జరిగాయని, వంద శాతం వీరిని రెగ్యులర్ చేయాలన్నారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారధి, దేవదర్శన్, ప్రకాశ్, ప్రియాంక, దీప్తి, రాజన్న, శ్రీకాంత్, భోజన్న పాల్గొన్నారు.

# గ్రామస్తులు ఏకమయ్యారు.. రోడ్డును నిలిపివేశారు

### రిలే నిరాహార దీక్షలు చేపట్టి సాధించిన కడ్తాల్ వాసులు



సర్వీసు రోడ్డును నిలిపివేయాలని కోరుతూ రోడ్డుపై రిలే నిరాహార దీక్ష చేస్తున్న కడ్తాల్ గ్రామస్తులు

సోన్, డిసెంబర్ 10 : మండలంలోని కడ్తాల్ గ్రామం గుండా ఎన్‌హెచ్-44 వెళ్తోంది. ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మించడంతో సర్వీసు రోడ్డు గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో మంగళవారం ఉదయం ఊరంతా కలిసి రోడ్డుపై టెంటు వేసుకుని రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎస్పీ ప్రభాకర్, తహసీల్దార్ మల్లేశ్, సీఐ నవీన్‌కుమార్‌తోపాటు సోన్, మామడ ఎస్సైలు కే.గోపి, సందీప్‌లు గ్రామస్తులతో మాట్లాడారు. తమ సమస్యను పరిష్కరించే వరకు కదిలేది లేదని దాదాపు 2 గంటలపాటు కూర్చున్నారు. ఎన్‌హెచ్-44 పీడీకి సమాచారం అందించడంతో ఆ సర్వీసు రోడ్డును నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో రిలే నిరాహార దీక్షను విరమించారు. వెంటనే ఎన్‌హెచ్ సిబ్బంది సర్వీసు రోడ్డుకు అడ్డుగా సిమెంట్ బిళ్లలు పెట్టించారు.

# ముందస్తు అరెస్టుపై మండిపాటు

ఎదులాపురం, డిసెంబర్ 10 : డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు వెళ్తున్న ఆశ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. అరెస్టులను ఖండిస్తు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలతో కలిసి బస్టాండ్ ఎదుట ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆశ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. చివరికి పోలీసుల నుంచి ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆశాలు లాక్కొని దహనం చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హక్కులు, కనీస వేతనం 18 వేలు చెల్లించాలనే డిమాండ్‌తో ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపు నివ్వడం జరిగిందని బొజ్జ ఆశన్న అన్నారు. మహిళలు అన్న కనీస సోయి లేకుండా మగ పోలీసులతో తొపులాడడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమానికి తరలిపోకుండా ఆశ కార్యకర్తలను అరెస్టు చేసి, ఠాణాకు తరలించడం సరైన విధానం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, ఆశ యూనియన్ నాయకులు లక్ష్మి, పుష్పలత, ఆశ, పార్వతి, దీక్ష, సంగీత, సుజాత, శాంత, స్వప్న పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

# పులి దాడిలో గొర్రెపిల్ల మృతి

నర్సాపూర్ (జీ), డిసెంబర్ 10 : పులి దాడిలో గొర్రెపిల్ల మృతి చెందిన ఘటన నర్సాపూర్ (జీ) మండలంలోని కుస్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. బాధితుడు మహేశ్ వివరాల ప్రకారం.. సోమవారం గొర్రె పిల్లలను మేతకు తీసుకెళ్లగా ఓ గొర్రెపిల్ల తప్పిపోయింది. దీని కోసం వెతుకుతుండగా అడవిలో మృతి చెందినట్లు తెలిసింది. దీంతో అటవీ అధికారులకు సమాచారం అందించగా అధికారులు స్పందించి ఘటన స్థలానికి చేరుకున్న ఎఫ్‌ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో సాయరెడ్డి అక్కడే పంచనామా నిర్వహించారు.